## వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరిగింది. ఉత్సవాల సందర్భంగా భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం స్వామివారిని 86,859 మంది దర్శించుకోగా 37,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న వివిధ



కానుకల ద్వారా హుండీకి రూ.3.63 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

## తిరుమలలో నేడు శ్రీవారి గరుడ సేవ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): టీటీడీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ సేవ నిర్వహించనున్నారు. మలయప్పస్వామి.. గరుడవాహనంపై సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11 గంటల వరకు విహరిస్తారు. ఈ సేవ కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. భక్తులరద్దీ దృష్ట్యా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు భక్తులకు అన్నప్రసాద సౌకర్యం కల్పించనున్నారు. భక్తుల కోసం 400కు పైగా బస్సులు ఏర్పాటుచేశారు. గరుడ సేవకు దాదాపు 3.50 లక్షల మంది భక్తులు రానున్నట్టు ఈవో అంచనా వేశారు.

# హైదరాబాద్ నుంచే ‘విశాఖ హనీట్రాప్’

- గ్యాంగ్ సభ్యులుగా సుమారు 15 మంది?
- 3 బ్యాంక్ అకౌంట్లు హైదరాబాద్ నుంచే నిర్వహణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : అందమే వాళ్ల పెట్టుబడి. డబ్బున్న మగాళ్లే వారి టార్గెట్. హస్కీ వాయిస్‌తో మాటాల్లోకి దించుతారు. పరిచయాలు, చాటింగ్స్, డేటింగ్స్, వీడియోకాల్స్‌తో మెల్లగా రంగంలోకి దించుతారు. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత అందినకాడికి దోచేస్తారు. విశాఖలో వెలుగుచూసిన ‘హనీట్రాప్’ అలాగే జరిగింది. ఈ ట్రాప్‌లో కీలక సూత్రధారి అయిన జమీమా అండ్ కో.. మొదట ఓనమాలు దిద్దింది హైదరాబాద్‌లోనే. ఇక్కడ పదుల సంఖ్యలో డబ్బున్న వారిని వంచించిన తర్వాతే వైజాగ్‌కు షిఫ్ట్ అయినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో మోసపోయిన వారిలో ఎక్కువగా ధనవంతులు, పెండ్లయినవారే ఉండటంతో ఏ ఒక్కరూ ఫిర్యాదులు చేయలేదని సమాచారం. దీనిని వెలుగులోకి తెచ్చిన విశాఖపట్నం సీపీ బాగ్చీ సైతం హైదరాబాద్ బాధితులు తమకు వివరాలు చెప్పాలని కోరారు.

### మూడు బ్యాంక్ అకౌంట్లు..

విదేశాల్లో స్థిరపడ్డ, బాగా సంపాదించిన మగవాళ్లను లక్ష్యంగా చేసుకొని మోసాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌లో మొత్తం 15 మంది వరకు సభ్యులు ఉన్నట్టు సమాచారం. వీరు నిర్వహిస్తున్న బ్యాంకు అకౌంట్లు హైదరాబాద్‌లో ఓపెన్ చేసినవే కావడటంతో ఇక్కడ కూడా వారి మూలాల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎన్నారైలకు అందమైన ఫొటోలు షేర్ చేసి ఆకర్షించడం, ప్రేమపెళ్లి పేరుతో లైన్‌లో పెట్టడం వీరి దినచర్య. ఎవరైతే వీరి వీడియోలకు లైక్‌లు, కామెంట్లు చేస్తారో వారి అకౌంట్లు, హోదా, అంతస్తు తదితర విషయాలను గమనించి వారిని లైన్‌లో పెడుతారు. రొమాంటిక్ వీడియోకాల్స్ చేసి స్వీట్‌గా మాట్లాడుతూ.. ఆ తర్వాత మెల్లిగా పెండ్లి ప్రపోజల్ తీసుకొస్తారు. ‘అమ్మానాన్నలతో మాట్లాడిన తర్వాతే ఏదైనా’.. అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత ఓ ఇంటి అడ్రస్ ఇస్తారు. అప్పటికే ఓ సినిమా స్టైల్‌లో నకిలీ పేరెంట్స్‌ను రంగంలోకి దించుతారు. అంతా ఓకే అనుకున్న తర్వాత.. వాళ్లే ఓ ప్లేస్ చెప్పి అక్కడికి రమ్మంటారు. రొమాన్స్ పేరుతో మత్తుమందు కలిపిన మందు తాపించి, డ్యాన్స్‌లు చేయించి సోయితప్పేలా చేస్తారు. ఆ తర్వాత వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. అడిగినంత ఇవ్వకపోతే ఫొటోలు సోషల్‌మీడియాలో పెడతామని బెదిరిస్తారు.




















































| S.No. | Gift | Winner Name | Coupon No. |
|---|---|---|---|
| 1 | 32" LED TV | GOPAL YADAV | 009246 |
| 2 | Smart Phone | D. RAMESH | 013248 |
| 3 | Gift Voucher | SWAYANTIKA DHANA | 038487 |